
# వినోద్ వెండి వెలుగులు

**800మీటర్ల విభాగంలో రజత పతకం • సౌత్ ఏషియన్ అథ్లెటిక్స్ టోర్నీ**



చెన్నై: సౌత్ ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ అథ్లెట్ వినోద్ వెండి వెలుగులు విరజిమ్మాడు. బుధవారం జరిగిన పురుషుల 800మీటర్ల రేసును వినోద్ 1:50:07సెకన్లలో ముగించి రెండో స్థానంతో రజత పతకం సొంతం చేసుకున్నాడు. ఇదే విభాగంలో శ్రీలంకకు చెందిన శవిందు అవిష్క(1:49:83సె), బోపన్న(1:50:45సె) వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. అంతర్జాతీయ స్థాయి టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబరిచిన వినోద్‌ను జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ నాగపురి రమేశ్ ప్రత్యేకంగా అభినందించారు. మరోవైపు పోటీల తొలి రోజైన బుధవారం భారత అథ్లెట్లు పలు రికార్డులు కొల్లగొట్టారు. మహిళల హైజంప్‌లో పూజ 1.80మీటర్ల దూరంతో మీట్ రికార్డుతో పసిడి ఖాతాలో వేసుకుంది. పురుషుల షాట్‌పుట్‌లో సిద్దార్థ్ చౌదరి 19.19మీటర్ల దూరంతో కొత్త రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. దక్షిణాసియా అథ్లెటిక్స్ ఫెడరేషన్(ఎస్‌ఏఏఎఫ్) ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ టోర్నీలో ఆతిథ్య భారత్ సహా ఏడు దేశాలు పోటీపడుతున్నాయని చీఫ్ లలిత్ బానోత్ పేర్కొన్నారు.

# వ్రితి పసిడి ధమాకా

**జాతీయ సీనియర్ స్విమ్మింగ్ టోర్నీ**

హైదరాబాద్, ఆట ప్రతినిధి: మంగళూరు వేదికగా జరుగుతున్న 77వ జాతీయ సీనియర్ అక్వాటిక్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర యువ స్విమ్మర్ వ్రితి పతక జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. ఈత కొలనులో తనకు తిరుగులేదని మరోమారు చాటిచెబుతూ వ్రితి సత్తాచాటింది. బుధవారం జరిగిన మహిళల 1500మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో వ్రితి పసిడి పతకంతో మెరిసింది. ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ ముందుకు సాగిన వ్రితి 17:45:63 సెకన్ల టైమింగ్‌తో అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు శిరిన్ (17:50:61సె, కర్ణాటక), భవ్య సచ్‌దేవా (18:00:28సె, ఢిల్లీ) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.

**శభాష్ వ్రితి: ఎక్స్‌లో కేటీఆర్**

జాతీయ సీనియర్ స్విమ్మింగ్ టోర్నీలో పతకాలు కొల్లగొడుతున్న యువ స్విమ్మర్ వ్రితి అగర్వాల్‌ను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'లో ప్రత్యేకంగా అభినందించారు. 'తెలంగాణ బిడ్డ వ్రితికి శుభాకాంక్షలు. స్విమ్మింగ్ పూల్‌లో పతకాలతో పాటు మా హృదయాలను గెలిచావు. తెలంగాణ గర్వపడేలా ఇలాంటి విజయాలు మరిన్ని సాధిస్తూనే ఉండాలి' అని రాసుకొచ్చారు.



## 'ఉష మద్దతివ్వలేదు'

**ఐవోఏ చీఫ్‌పై వినేశ్ తీవ్ర విమర్శలు**

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ సందర్భంగా తనకు భారత ఒలింపిక్ సంఘం(ఐవోఏ) చీఫ్ పీటీ ఉష నుంచి ఎలాంటి మద్దతు లభించలేదని స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ తీవ్ర విమర్శలు చేసింది. అనర్హత వేటుతో దవాఖానలో బెడ్‌పై తనకు ఐవోఏ నుంచి ఆశించిన రీతిలో సహకారం దొరుకలేదని వ్యాఖ్యానించింది. అనుమతి లేకుండానే బెడ్‌పై ఉన్న తనతో దిగిన ఫొటోను పీటీ ఉష సోషల్‌మీడియాలో పోస్ట్ చేసిందని స్థానిక మీడియాతో అంది. ఇలా చేయడంతోనే మద్దతు ఇచ్చినట్లు కాదని, తెర వెనుక రాజకీయాల వల్లే తాను రెజ్లింగ్ దూరమయ్యానని వినేశ్ చెప్పుకొచ్చింది.

# 'బుచ్చిబాబు' విజేత హైదరాబాద్

**ఫైనల్లో ఛత్తీస్‌గఢ్‌పై ఘన విజయం • ఏడేండ్ల తర్వాత టైటిల్ కైవసం • జట్టుకు జగన్ అభినందనలు**




హైదరాబాద్, ఆట ప్రతినిధి: చాలా రోజుల తర్వాత హైదరాబాద్ క్రికెట్‌కు మళ్లీ మంచి రోజులు వచ్చాయి. అవును సమిష్టి ప్రదర్శనతో సత్తాచాటుతూ హైదరాబాద్ క్రికెట్ జట్టు ఆల్‌ఇండియా బుచ్చిబాబు ఇన్విటేషన్ టోర్నీలో విజేతగా నిలిచింది. బుధవారం ముగిసిన ఫైనల్లో ఛత్తీస్‌గఢ్‌పై 243 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. ఈ క్రమంలో ఏడేండ్ల తర్వాత హైదరాబాద్ బుచ్చిబాబు టోర్నీలో తిరిగి టైటిల్ దక్కించుకోవడం విశేషం. మ్యాచ్ విషయానికొస్తే..హైదరాబాద్ నిర్దేశించిన 518 పరుగుల భారీ లక్ష్యఛేదనలో ఛత్తీస్‌గఢ్ రెండో ఇన్నింగ్స్‌లో 61.1 ఓవర్లలో 274 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్లు ఆయూశ్ పాండే(117), శశాంక్ చంద్రకర్(50) రాణించారు. వీరిద్దరు కలిసి తొలి వికెట్‌కు 103 బంతుల్లో 100 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అయితే స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్(5/61) ఐదు వికెట్ల విజృంభణతో ఛత్తీస్‌గఢ్ పతనాన్ని శాసించాడు. ఒకానొక దశలో మెరుగ్గా కనిపించిన ఛత్తీస్‌గఢ్..హైదరాబాద్ బౌలర్ల ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది.

**హైదరాబాద్ భేష్-జగన్ అభినందన:** బుచ్చిబాబు టోర్నీ విజేతగా నిలిచిన హైదరాబాద్ జట్టును అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, కార్యదర్శి దేవరాజ్ ప్రత్యేకంగా అభినందించారు. విజయంలో కీలకంగా వ్యవహరించిన రోహిత్‌రాయుడు, రాహుల్‌సింగ్, అభిరత్ రెడ్డి, తనయ్ త్యాగరాజన్, అనికేత్‌రెడ్డిని ప్రశంసించారు. హైదరాబాద్ చేరుకున్నాక జట్టు సభ్యులను ఘనంగా సన్మానించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జగన్ పేర్కొన్నారు.

## వరల్డ్‌కప్‌తో వేల కోట్లు!

• **ఐసీసీ నివేదికలో వెల్లడి**

దుబాయ్: వన్డే వరల్డ్‌కప్‌లో భారత్‌లో కనకవర్షం కురిసిందని అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) తాజా నివేదికలో పేర్కొంది. గతేడాది జరిగిన ప్రపంచకప్ ద్వారా దాదాపు 11,637 కోట్ల మేర ప్రయోజనం జరిగినట్లు నీల్సన్ జరిపిన సర్వేలో తేలింది. ఈ విషయాన్ని ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జెఫ్ అలార్‌డైస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. 'మెగాటోర్నీలో మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిన నగరాల్లో టూరిజం ద్వారా 7వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. ముఖ్యంగా ట్రావెల్, ట్రాన్స్‌పోర్టేషన్, ఫుడ్, విదేశీ పర్యాటకులతో భారీ ఎత్తున డబ్బులు వచ్చాయి' అని ఐసీసీ పేర్కొంది.

## 18 ఏండ్ల లోపువారికి ఫ్రీ టికెట్లు

**ఐసీసీ ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్**

దుబాయ్: ఈ ఏడాది అక్టోబర్ 3 నుంచి 20 మధ్య యూఏఈ వేదికగా జరగాల్సి ఉన్న మహిళల టీ20 ప్రపంచకప్‌ను విజయవంతం చేసేందుకు ఐసీసీ కీలక నిర్ణయం తీసుకుంది. 18 ఏండ్ల లోపు ఉన్న వారికి వరల్డ్ కప్ మ్యాచ్‌లను ఉచితంగా వీక్షించేందుకు అవకాశం కల్పించింది. అంతే గాక 18 ఏండ్ల వయసు పైబడ్డవారికి టికెట్ రేట్ల ప్రారంభ ధరను 5 ధిరమ్స్ (భారత కరెన్సీలో రూ. 115) గా నిర్ణయించినట్టు జెఫ్ అలార్డిస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# సెమీస్‌కు భారత్

**మలేషియాపై 8-1తో ఘన విజయం • ఏషియన్ హాకీ చాంపియన్స్ ట్రోఫీ**



హులన్‌బుయిర్ (చైనా): ఏషియన్ హాకీ చాంపియన్స్ ట్రోఫీలో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్ జోరు కొనసాగిస్తోంది. వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచిన 'మెన్ ఇన్ బ్లూ' ఈ టోర్నీలో సెమీస్‌కు అర్హత సాధించింది. బుధవారం హులన్‌బుయిర్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో భారత్.. 8-1తో మలేషియాను చిత్తుచిత్తుగా ఓడించింది. చైనా, జపాన్‌పై రెచ్చిపోయిన యువ స్ట్రైకర్లు మలేషియాతో మ్యాచ్‌లో గోల్స్ పండుగ చేసుకున్నారు. రాజ్‌కుమార్ హ్యాట్రిక్ గోల్స్ (3, 25, 33 నిమిషాల్లో) చేయగా అరేజీత్ సింగ్ హుండాల్ (6, 39) రెండు గోల్స్ కొట్టాడు. జుగ్‌రాజ్ సింగ్ (7), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (22), ఉత్తమ్ సింగ్ (40) తలా ఓ గోల్ చేసి భారత్‌కు భారీ విజయాన్ని అందించారు. మలేషియా నుంచి అఖిముల్లా అనుర్ ఒక్కడే 34వ నిమిషంలో గోల్ చేయగలిగాడు. ఆట ఆరంభం నుంచీ ముగింపు దాకా ప్రత్యర్థిపై గోల్స్‌తో విరుచుపడ్డ భారత్.. ఈ విజయంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని నిలబెట్టుకోవడంతో పాటు సెమీస్ బెర్తునూ ఖాయం చేసుకుంది. లీగ్ దశలో భాగంగా భారత్ తమ తదుపరి మ్యాచ్‌లను దక్షిణకొరియా, పాకిస్థాన్‌తో ఆడాల్సి ఉంది.

## నేటి నుంచే రెండో దశ మ్యాచ్‌లు

అనంతపూర్: భారత స్టార్ క్రికెటర్లు ఆడుతున్న దులీప్ ట్రోఫీలో గురువారం నుంచి రెండో దశ మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్ ఈ మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వనున్నది. భారత్, బంగ్లా తొలి టెస్టుకు ముందు జట్టులో చోటు కోల్పోయిన పలువురు ఆటగాళ్లకు రెండో టెస్టులో చోటు దక్కించుకునేందుకు ఇది సువర్ణావకాశం. నాలుగు జట్లు (ఇండియా ఏ, బీ, సీ, డీ)గా విడిపోయిన ఆటగాళ్లు.. సత్తాచాటేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. తొలి టెస్టులో చోటు దక్కినా ఇంకా దులీప్ ట్రోఫీ నుంచి రిలీజ్ కాని సర్ఫరాజ్ ఖాన్‌తో పాటు తొలి మ్యాచ్‌లో భారీ శతకం చేసిన అతడి తమ్ముడు ముషీర్ ఖాన్, శ్రేయస్ అయ్యర్, మొదటి మ్యాచ్ ఆడనున్న రింకూ సింగ్‌పై అందరి దృష్టి నెలకొని ఉంది.

# మీకో దండం.. మేం మీతో ఉండం!

**సోషల్ మీడియా పోస్టులు తప్ప మమ్మల్ని ఎప్పుడైనా పట్టించుకున్నారా? • బ్యాడ్మింటన్ అసోసియేషన్‌పై పారా షట్లర్ నితేశ్ ఆగ్రహం**




ఢిల్లీ: జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య (బాయ్) పారా షట్లర్లపై వ్యవహరిస్తున్న తీరుపై పారాలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన నితేశ్ కుమార్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఎస్‌ఎల్3 కేటగిరీలో స్వర్ణం గెలిచిన నితేశ్ కుమార్‌తో పాటు ఇతర షట్లర్లనూ అభినందిస్తూ బాయ్ 'ఎక్స్'లో చేసిన ట్వీట్‌కు అతడు ఘాటుగా రిప్లై ఇచ్చాడు. 'సోషల్ మీడియాలో అభినందించే పోస్టులు తప్ప (అది కూడా అరుదుగా) పారా షట్లర్ల పట్ల మీరు వ్యవహరిస్తున్న తీరుపై మేం తీవ్ర అసంతృప్తితో ఉన్నాం. దయచేసి మమ్మల్ని బాయ్, సాయ్ నుంచి తప్పించి పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా (పీసీఐ)కు అప్పగించండి' అంటూ చేసిన ట్వీట్ దుమారం రేపింది. ట్వీట్ తర్వాత అతడు పీటీఐతో మాట్లాడుతూ... 'మేం (షట్లర్లు) పారా ఆసియా క్రీడల్లో 21 పతకాలు గెలిచాం. వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో సుమారు 15 పతకాలు పట్టుకొచ్చాం. పారాలింపిక్స్‌లో 5 మెడల్స్ నెగ్గాం. అయినా బాయ్ నుంచి మాకు కనీస గుర్తింపు కూడా దక్కలేదు. ఇదేం కొత్త కాదు. చాలా రోజుల నుంచి మాకు ఇది నిత్యకృత్యమే. వాళ్ల (బాయ్) దృష్టి మొత్తం అవయవాలు సక్రమంగా ఉన్న షట్లర్లపైనే ఉంటుంది తప్ప మమ్మల్ని కనీసం పట్టించుకునే నాథుడే ఉండడు..' అని ఆగ్రహం వ్యక్తం చేశాడు.

**నిర్వహణ లోపాలతో ఆగమాగం**

బాయ్‌లో పారా షట్లర్ల అడ్మినిస్ట్రేషన్ కూడా గందరగోళంగా ఉందని నితేశ్ అన్నాడు. 'బాయ్‌లో మాకు సంబంధించిన వ్యవహారాలన్నీ చూసుకునేవాళ్లు ఒక్కరో ఇద్దరో ఉంటారు. దీని వల్ల మేం అడ్మినిస్ట్రేషన్ పరంగా తీవ్ర సమస్యలు ఎదుర్కుంటున్నాం. కొన్ని టోర్నీలలో కీలక ఆటగాళ్ల పేర్లు కూడా ఉండవు. మేం ఏదైనా టూర్లకు వెళ్లాలనుకుంటే చివరి నిమిషం దాకా టికెట్లు కన్ఫర్మ్ అయ్యాయో లేదో తెలియని సందిగ్ధ పరిస్థితులుంటాయి. హోటల్ గదులు కూడా టైమ్‌కు బుక్ అవ్వవు. కీలక టోర్నీలకు ముందు ఇలాంటి సమస్యలు మానసికంగా మమ్మల్ని చాలా వేధిస్తాయి' అంటూ గోడు వెల్లబోసుకున్నాడు. పారా షట్లర్లంతా ఇటీవలే కేంద్ర క్రీడా మంత్రి (మన్సూఖ్ మాండవీయ)ని కలిసి ఆయనకు తమ సమస్యలు వివరించామని, ఆయన త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని చెప్పారని తెలిపాడు.

# మూడో రోజూ బంతి పడలె!

నోయిడా: అఫ్గానిస్థాన్, న్యూజిలాండ్ మధ్య నోయిడా వేదికగా జరగాల్సి ఉన్న ఏకైక టెస్టు మూడో రోజూ ఒక్క బంతి కూడా పడకుండానే రద్దైంది. తొలి రెండు రోజులు ఔట్ ఫీల్డ్ తడిగా ఉండటంతో రద్దైన మ్యాచ్.. మూడో రోజు వర్షం కారణంగా ఆగిపోయింది. ఈ మ్యాచ్‌లో ఇంతవరకూ టాస్ సైతం పడకపోవడం గమనార్హం. వర్షం నుంచి మైదానాన్ని పూర్తిగా కప్పిఉంచేలా అరుణ్ జైట్లీ స్టేడియం (ఢిల్లీ) నుంచి ప్రత్యేకంగా కవర్లు తెప్పించినా కొన్ని ప్రదేశాలలో నీరు ఇంకే ఉంది. అదీగాక రాబోయే రెండు రోజుల్లో నోయిడాలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఈ మ్యాచ్ సాగడం అనుమానంగానే ఉంది. ఒకవేళ వరుణుడు సహకరించి ఆట సాగితే మాత్రం చివరి రెండు రోజులూ 98 ఓవర్ల పాటు మ్యాచ్‌ను నిర్వహిస్తామని అంపైర్లు తెలిపారు.



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.